క్లుప్తంగా

ముగిసిన కబడ్డీ పోటీలు



దాచేపల్లి : దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బీసీ కాలనీలో జరిగిన ఈ పోటీల్లో దాచేపల్లి ఎంఎల్‌టీటీ జట్టు మొదటి స్థానం, గామాలపాడు జట్టు రెండో స్థానం, దాచేపల్లి ఎంఎల్‌టీటీ జూనియర్స్ మూడో స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు నిర్వాహకులు బహుమతులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు షేక్ జానీబాషా, పగడాల బాస్కర్‌రావు, షేక్ మస్తాన్‌వలి, జక్కుల వీరాస్వామి, దండే వీరయ్య, తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



దాచేపల్లి : యువత సన్మార్గంలో నడవాలని గురుకుల్ లూథరన్ కళాశాల ప్రొఫెసర్ వి.ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి లూథరన్ చర్చిలో యువజనుల ప్రత్యేక ఆరాధన ఆదివారం నిర్వహించారు. యువతీ, యువకులు ప్రత్యేక గీతాలను ఆలపించారు. స్థానిక సంఘ కాపరి రెవరెండ్ గనుపల్లి శ్యాం ప్రసన్నకుమార్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. దైవ సందేశం వినిపించారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప గుడి నిర్మాణానికి భూమిపూజ



గురజాల రూరల్ (చర్లగుడిపాడు) : చర్లగుడిపాడులో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైల్వే అధికారి బండ్ల లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారికి వేముల విశ్వేశ్వరరావు దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, మాలధారులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



మాచర్ల: దసరా పండుగ పురస్కరించుకొని అల్లం రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 20 మంది నిరుపేదలకు పట్టణంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అల్లం కోటిరెడ్డి ప్రతి ఏడాది తన ట్రస్ట్ తరపున వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ అల్లం వెంకటేశ్వర్‌రెడ్డి, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, కార్యదర్శి చుండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీలు



ఈపూరు: మండలంలోని ఈపూరు, వనికుంట దేవాలయాల్లో శనివారం రాత్రి చోరీలు జరిగాయి. ఈపూరు బొటిమీద ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ముందు తలుపు తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన దొంగలు హుండీని పగలగొట్టి అందులోని నగదును దోచుకున్నారు. అలాగే వనికుంట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ముందు తలుపులను విరగ్గొట్టి, తాళాలను పగలగొట్టి లోపల ఉన్న హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును దోచుకెళ్లారు. రెండు దేవాలయాల్లో దొంగతనాలు ఒకేసారి జరగడంతో దొంగలు ఒక ముఠాగా ఏర్పడి చోరీ చేసినట్లు భావిస్తున్నారు.

ఆలకించే నాథుడెక్కడ!

- కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క
- ముళ్లపొదలను తలపిస్తున్న వైనం
- ఆయకట్టు శివారుకు అందని నీరు
- ఆందోళనలో కర్షకులు



గుర్రపు డెక్క ఆకులతో నిండిన గొట్టిముక్కల మేజర్ కాలువ

రెంటచింతల: మండలంలోని మేజర్, మైనర్ కాలువలు గుర్రపుడెక్కతో పేరుకుపోయాయి. ముళ్లపొదలను తలపిస్తున్నాయి. నీటి పారుదల సరిగా సాగడం లేదు. ఫలితంగా ఆయకట్టు చివరి భూములకు నీరందడం లేదు. అయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కష్టాన్ని ఆలకించే నాథుడు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సాగునీటికి కాలువలే ఆధారం

మండలంలో సేద్యానికి సాగునీటి కాలువలే ఆధారం. గొట్టిముక్కల మేజర్ కాలువ కింద మాడుగుల, రెంటాల, రెంటచింతల, గురజాల, మిట్టగుడిపాడు, గోలి, సమాదానపేట, గొట్టిముక్కల గ్రామాలకు చెందిన 15,347 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. రెంటచింతల మేజర్ కాలువ (ఎర్రకాలువ) కింద మాడుగుల, మంచికల్లు, రెంటాల, రెంటచింతల, మిట్టగుడిపాడు, గోలి గ్రామాల పరిధిలో సుమారు 4,384 ఎకరాల ఆయకట్టు ఉంది.

మల్లవరం మేజర్ కాలువ ఆయకట్టు కింద మాచర్ల, అమ్మని జమ్మలమడక, కంభంపాడు, గన్నవరం, తుమృకోట, పాలువాయి, పశర్లపాడు, జెట్టిపాలెం, మల్లవరం గ్రామాలకు చెందిన 8,830 ఎకరాల భూములున్నాయి. పాలువాయి మేజర్ కాలువ పరిధిలో కంభంపాడు, మంచికల్లు, పాలువాయిగేటు, పాలువాయి, పశర్లపాడు గ్రామాల రైతులకు చెందిన 4,494 ఎకరాల భూములకు సాగునీరు అందవలసి ఉంది. రెంటచింతల గ్రామ సమీపంలో ఉన్న 10 ఎల్ మైనర్ (చిన్నకాలువ) పరిధిలో రెంటచింతల, మిట్టగుడిపాడు గ్రామాలకు చెందిన 1,251 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు పారుతుంది. అయితే ఇవి అన్నీ అధ్వానంగా తయారయ్యాయి. డెక్క పేరుకుపోయి సాగునీరు పారడం లేదు. చెంతనే సాగర్ ప్రాజెక్టు ఉన్నా.. తమకు ఈ సాగునీటి కష్టాలేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాలువల్లో తక్షణం డెక్క తొలగించాలని కోరుతున్నారు.



ముళ్లపొదలతో నిండి చిట్టడవిని తలపిస్తున్న రెంటచింతల మేజర్ కాలువ(ఎర్రకాలువ)

మేజర్ కాలువ అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలి



రెంటచింతల మేజర్ కాలువ(ఎర్రకాలువ) పరిధిలో నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు పంటలకు సుమారు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. కాలువ ద్వారా సాగునీరు అందకపోతే సాగుచేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. రెంటచింతల మేజర్ కాలువ అభివృద్ధి పనులు చేపట్టి సాగునీరు అందజేయాలి.

– బోయిన కోటేశ్వరరావు, కౌలురైతు, రెంటచింతల

ముళ్లపొదలతో చిట్టడవి



ముళ్ల పొదలతో చిట్టడవిని తలపిస్తున్న రెంటచింతల మేజర్ కాలువ ద్వారా చివరి ఆయకట్టు భూముల రైతులకే కాకుండా కాలువ ఎగువనున్న రైతులకు కూడా సాగునీరు అందని దుస్థితి నెలకొంది. ఈ ఏడాది 8 ఎకరాలను కౌలుకు తీసుకుని మిరప, పత్తి పంటలను సాగు చేస్తున్నాను. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండి అధ్వానంగా ఉన్న కాలువల అభివృద్ధి పనులు చేపట్టి సాగునీరు అందచేస్తేనే మా రైతుల సాగునీటి కష్టాలు తీరుతాయి.

– పేర్ల లింగయ్య, కౌలురైతు, రెంటచింతల

వేంకటేశ్వరస్వామి కల్యాణం



మాచర్ల: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి జన్మ నక్షత్రం, దసర పండగ సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పలువురు పుణ్య దంపతులు పీటలపై కూర్చోగా అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు పూజలు చేశారు. వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ మెంబర్లు బోయా రామిరెడ్డి, బండ్ల వెంకటేశ్వర్లు, కళ్యాణ కమిటీ సభ్యులు పోలిశెట్టి పిచ్చయ్య, కొత్తమాసు బ్రహ్మారావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బంగారు నేత్రాలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బంగారు నేత్రాలను అమరావతికి కోనూరు దేవిప్రసాద్ కుటుంబ సభ్యులు సమర్పించారు. సుమారు 7 గ్రాముల బరువుతో రూ.60 వేల విలువైన రెండు బంగారు నేత్రాలకు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి ఈవో వేమూరి గోపినాథ శర్మకి అప్పగించారు. అర్చకులు శంకర మంచి రాజేష్‌శర్మ, రాజశేఖరశర్మ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు చేసి, నేత్రాలను అలంకరించారు. తొలుత దాతలు అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరిదేవికి పూజలు నిర్వహించారు



గురజాల మండలం శ్రీరాంపురంలోని బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న మహిళలు



పిడుగురాళ్లల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను, బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకొని వెళ్తున్న భక్తులు



రెంటచింతలలో స్వర్ణ కవచ ధారిణిగా వాసవీమాత



మాచవరం మండలం మొర్జంపూడిలో రాజరాజేశ్వరి దేవిగా..



మాచర్లలో రాజరాజేశ్వరి దేవిగా వాసవీమాత



పిడుగురాళ్ల నాగుల గుడిలో శతచండీ యాగం



దాచేపల్లి మండలం నారాయణపురంలో బతుకమ్మని ఊరేగింపునకు తీసుకెళ్తున్న భక్తులు



పిడుగురాళ్లలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే యరపతినేని

వైభవంగా విజయ దశమి

విజయదశమి ఉత్సవాలు ముగిశాయి. తొమ్మిది రోజులపాటు వివిధ అలంకారాల్లో ప్రత్యేక పూజలు అందుకున్న అమ్మవారు శనివారం రాజేరాజేశ్వరిదేవిగా భక్తులను కటాక్షించారు. పలుచోట్ల బతుకమ్మ వేడుకలూ జరిగాయి. ప్రజలంతా ఉత్సాహంగా పండగ జరుపుకున్నారు. అమ్మవారి నిమజ్జనోత్సవాల్లో పాలుపంచుకున్నారు.

– గురజాల/రెంటచింతల/దాచేపల్లి/పిడుగురాళ్ల/మాచవరం/మాచర్ల/మాచర్ల రూరల్



మాచర్ల పత్తిఫ్యాక్టరీ వీధిలో అమ్మవారి నిమజ్జనోత్సవం



మాచర్ల రూరల్ మండలం కొత్తపల్లిలో అమ్మవారి నిమజ్జనోత్సవంలో కోలాటం



రెంటచింతల సీతారామ స్వామి గుడికి పల్లకిని బహూకరిస్తున్న భక్తులు

బతుకమ్మ పాటల పోటీలు

జెట్టిపాలెం(రెంటచింతల): విజయదశమి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో గిరిజన నాయకులు వడితే భీమ్లానాయక్, శంకర్‌నాయక్ శనివారం బాలలకు బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందచేశారు. గిరిజన నాయకులు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలలో భాగంగా జెట్టిపాలెం గ్రామంలో ఏటా క్రమం తప్పకుండా దసరా ఉత్సవాలలో విజయదశమి రోజున గిరిజన బాలిబాలికలకు బతుకమ్మ పాటలు పోటీలు నిర్వహిస్నట్లు తెలిపారు. సుమారు 1000 సంవత్సరాల నుంచి తెలుగు రాష్ట్రాలలో ఈ బతుకమ్మ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.



జెట్టిపాలెంలో బతుకమ్మ పాటలు పోటీలు నిర్వహించి బహుమతులను పంపిణీ చేస్తున్న గిరిజన నాయకులు

• వాహనదారి పాట్లు



బ్యాంక్ సెంటర్ వద్ద రోడ్డుపైనే ఆపిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు



మాల్స్ వద్ద నడిరోడ్డుపై పార్కింగ్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు

పిడుగురాళ్ల పట్టణంలో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలు, బ్యాంకులు, హోటళ్లు పార్కింగ్ స్థలం చూపకపోవడంతో ప్రజలు రోడ్లపైనే వాహనాలు పార్క్ చేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. కొన్నిసార్లు ప్రమాదాలూ జరుగుతున్నాయి. ఇటీవల బ్యాంక్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య వల్ల ఓ ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొట్టింది. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి పార్కింగ్‌కు స్థలం చూపించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – పిడుగురాళ్ల

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

మాచర్ల: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో స్వామి వివేకానంద సేవా ఆశ్రమంలో జాతీయ నాయకుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయ నేతలు, స్వర్గీయ మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద, సర్వేపల్లి రాధాకృష్ణ, అబ్దుల్ కలాం విగ్రహాలు ఆవిష్కరించారు. కార్యక్రమానికి స్వామి వివేకానంద ట్రస్టు వ్యవస్థాపకులు మెట్టు గోవిందరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మీనాక్షి కంటి ఆస్పత్రి చైర్మన్ చిరుమామిళ్ళ కృష్ణయ్య, వృద్ధాశ్రమ నిర్వాహకులు పోలిశెట్టి పిచ్చయ్య, పోలిశెట్టి చిన పిచ్చయ్య, కజ్జం సైదయ్యలు మాట్లాడుతూ 20 ఏళ్లగా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజా సేవ చేయటం అభినందనీయమన్నారు. విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో విగ్రహ దాతలు, డెప్యూటీ డీఈఓ రామకృష్ణ, రోటరీ క్లబ్ సీనియర్ సభ్యులు లక్ష్మీనారాయణ, పల్నాడు జూనియర్ కళాశాల డైరెక్టర్ నాగూర్‌వలి, స్టేట్ బ్యాంకు ఉద్యోగి శర్మ జాతీయ నాయకులకు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు, హాజరైన వారికి పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విగ్రహదాతలు మెట్టు శివారెడ్డి, నాగమణి దంపతులు, ముత్యాల పాపిరెడ్డి, జక్కిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సైంటిస్టు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న కజ్జం సైదయ్య. పాల్గొన్న ఆయా ట్రస్ట్ పెద్దలు

ప్రకృతి మహిమ



దసరా రోజున వాన కురుస్తున్న దృశ్యం



ఆదివారం ఉదయం మంచు

మాచర్ల పట్టణంలో మూడు రోజులుగా విచిత్ర వాతావరణం నెలకొంది. కాసేపు ఎండ, అంతలోనే వర్షం ప్రజలను ఆశ్చర్యచకితులను చేసింది. ఇదిలా ఉంటే ఆదివారం ఉదయం పట్టణాన్ని మంచు దుప్పటి కప్పేసింది. దారి కనపడక వాహనదారులు ఇబ్బంది పడ్డారు. -మాచర్ల

ఆరుగురు జూదరుల అరెస్ట్

సత్తెనపల్లి: పేకాట స్థావరంపై పట్టణ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని 28వ వార్డ్ పరిధిలో ఉన్న దోభి ఘాట్ వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,750 నగదు స్వాధీనం చేసుకున్నారు.

యువకుడి అదృశ్యం



మాచర్ల రూరల్: మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ళ శ్రీనివాసరావు (23) కంభంపాడు గ్రామ కుడికాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ళ శ్రీనివాసరావు (23) రెండు రోజుల క్రితం కంభంపాడు వద్ద కుడికాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మృతదేహం కోసం బుగ్గవాగు రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ నేటికీ మృతదేహం కనిపించలేదని, ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఎం నారాయణ తెలిపారు.

పోలీసులే నిందితులను కాపాడటం సిగ్గుచేటు

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నరసరావుపేట: లగడపాడు దళితులపై దాడులు చేసిన అగ్రకుల పెత్తందారులపై కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాల్సిన పోలీసు ఉన్నతాధికారులే అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి నిందితులను కాపాడటం సిగ్గుచేటని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గాంధీ పార్క్ ఎదుట ధర్నా కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దళితులపై దాడి చేసిన వారిని ఎస్సీ, ఎస్టీ చట్టం కింద వెంటనే అరెస్టు చేసి, బాధితులపై పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 14న కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితులు చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం జిల్లా కమిటీ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి బలవన్మరణం

నాదెండ్ల: కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గణపవరంలోని చవిటిపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చవిటిపాలెంలో నివాసం ఉండే షేక్ జానీబాషా (46) చిలకలూరిపేటలోని ఓ రైస్‌మిల్లులో కార్మికుడిగా పనిచేస్తుంటాడు. ఈ నెల 11న రాత్రి సమయంలో గడ్డిమందు తాగి పడుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు జానీబాషాను నిద్రలేపేందుకు యత్నించగా అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. భార్య షేక్ రషీదా పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.